
**కా**ర్తీక పౌర్ణమి... పున్నమి చంద్రుడు వింత సొగసులతో వెలిగిపోతున్నాడు. రెండు కొబ్బరి చెట్ల నడుమ ఉయ్యాల ఊగుతున్నట్లే ఉన్నాడు. డాబా అంతటా పరుచుకున్న వెన్నెల మనసు కెంతో హాయినిస్తోంది. తనకు దేవుని మీద భక్తి కంటే సాహిత్యం మీద మక్కువ ఎక్కువ. కానీ ఈ రోజు మాత్రం రోజంతా ఉపవాసం ఉండి, సాయంత్రం ఆరు దాటాక తులసికోట ముందు మూడు వందల అరవై అయిదు వత్తులు వెలిగించి భక్తితో నమస్కరిస్తుంది. అలా చేస్తే సంవత్సరమంతా దేవుని దగ్గర దీపం పెట్టినట్లే అవుతుందని అత్తగారు 'కాంతిమతి' చెప్పటంతో పెళ్ళయిన దగ్గర నుంచి క్రమం తప్పకుండా చేస్తోంది.

వాళ్ళంతా శివాలయానికి వెళ్ళి అక్కడ దీపాలు వెలిగించుకుంటారు. తనకు మాత్రం ఇంట్లో చేసుకోవటమే ప్రశాంతంగా ఉంటుంది. తోడికోడళ్ళు దివ్య, రమ్యలకి కూడా పూజ లంటే ఇష్టం. అందులోనూ అత్తయ్యగారితో కలిసి చేయడమంటే ఇంకా ఇష్టం. ఎక్కడకు వెళ్ళినా ముగ్గురూ కలిసే వెళ్తారు. ఆ అన్నా దమ్ములూ అంతే. ఎవరి స్నేహితులు వారికి ఉన్నా, బయటకు ఎక్కడికయినా వెళ్లాలంటే



# స్నేహ గుజ్జి

ముగ్గురూ మాట్లాడుకొని కుదిరిన టైమ్‌లోనే వెళతారు. అలా కుదరకపోతే మానేసుకుంటారు గానీ విడివిడిగా మాత్రం ఏ ప్రోగ్రామ్‌కీ వెళ్ళరు. ఈ కాలంలో అలా ఉండడం తనని ఎప్పుడూ అబ్బురపరుస్తూంటుంది.

ఉమ్మడి కుటుంబం అంటే గొడవలు అని అందరూ చెప్పుకోవడం విని, ముందుగా ఈ సంబంధం చేసుకోవడానికి భయపడింది. తల్లి, తండ్రీ నచ్చచెప్పారు. వాళ్లది మంచి కుటుంబమని, అక్కడ నిన్నిస్తే మళ్లీ మేము తిరిగి వెనక్కి చూసుకోనక్కరలేదని. చిన్నప్పటి నుంచీ మనకేది కావాలో మనం అడగకుండానే మనసులో మాట మనసులో ఉండగానే ఆ కోరికను కనిపెట్టి, తీర్చే అమ్మానాన్నల మాటకు విలువిచ్చి ఒప్పుకోవడం ఎంతో మంచిదయిందని ఇప్పుడు ప్రతినిమిషం అనిపిస్తూ ఉంటుంది.

అత్తగారు, మామగారూ తమని కన్న కూతుర్లలా చూసుకోవడంతో పెళ్లి అంటేనే భయపడే తను వివాహబంధం, కుటుంబ అనుబంధం ఇంత మధురమైనదా అనే స్థితికి వచ్చేసింది. మరి కోడళ్లను తగలబెట్టే అత్తగార్లు లేని పేపరు ఉంటోందా ఈ రోజున? ఇలాంటి పెళ్లిళ్లు చేసుకోకపోతే ఏం? అనుక్షణం భయం భయంగా బ్రతికే బ్రతుకూ ఒకటేనా అనిపించేది అప్పుడు. అందమైన చంద్రుడిని చూస్తూ, తన అందం, ఆనందం కలగాపులగమైన జీవితాన్ని తలచుకుంటున్న హేమంత వెనక నుంచి పక్కింటి వెన్నెల పిలుపుతో ఈ లోకంలోకి వచ్చింది.

"ఖాళీయేనా? రానా?" అడిగింది పక్క డాబా మీదనుంచి వెన్నెల.

"రా...! ఒక గంటదాకా పని ఏం లేదు. వస్తే సరదాగా కబుర్లు పంచుకుందాం" అంది హేమంత.

"ఇప్పుడే వచ్చేస్తా... తాళంపెట్టి" అని హుషారుగా క్రిందకు దిగింది వెన్నెల.

అక్కడే ఒక ప్రక్కగా ఉంచిన చాపను పరిచింది కూర్చోవడానికి అనువుగా. రెండు నిమిషాలలో డాబాపైకి చేరింది వెన్నెల.

"సుమంత్ ఈ రోజు రాలేదా ఇంకా?"

"లేదక్కా! బోరుగా ఉంది. ఇంతలో నువ్వు ఖాళీగా కన్పించావ్, వచ్చేసాను".

"ఈ మధ్య సుమంత్ రావటం ఆలస్యమవుతున్నట్లుంది"

"అవునక్కా! కొబ్బరికాయల వ్యాపారం కదా. పండగలున్నప్పుడు ఆలస్యమవుతూనే ఉంటుంది. ఒంటరి కాపురం అని సరదా పడ్డా

**యలమర్తి అనూరాధ**

నే కానీ ఒక్కనెలకే విసుగువస్తోందనుకో" అంటూనే ఆకాశం వైపు చూసి "అక్కా! ఈ రోజేమిటి చంద్రుడొక్కడే ఉన్నాడు. ఒక్క చుక్కా కనబడదేం" అడిగింది.

తనింతసేపూ ఇక్కడే కూర్చుంది. ఆ ఆలోచనే రాలేదు. అలా చంద్రుడినే చూసిన కొద్దీ చూడాలనిపించింది. చుక్కల మధ్య చంద్రుడిని చూసినప్పుడల్లా ఆకాశం కూడా ఓ ఉమ్మడి కుటుంబంలా ఉంటుంది. చుట్టూ చుక్కలుండడం తనకా ఆలోచన తెప్పించేది.

"అవును. నేనా విషయాన్ని గమనించనే లేదు. ఆలోచనల్లో ఉన్నానులే!"


"ఏమిటా ఆలోచనలు?"

"అదే...! పెద్ద కుటుంబంలోకి రావటానికి కొంత సంశయించాను" ఇంకా చెప్పబోయే లోపే వెన్నెల అందుకుని "అందుకేకదక్కా! నేను వేరే కాపురం అయితేనే చేసుకుంటానని కండిషన్ పెట్టింది. సుమంత్ నన్ను ప్రేమించాడు కాబట్టి ఒప్పుకున్నాడు. లేకపోతే ఇంకొకరయితే అసలు ఒప్పుకొనేవాడుకాదు. నా దగ్గర అలా అని ఎన్నిసార్లు చెబుతాడో?"

"అందరూ కలిసిపోతే ఇదే బాగుంటుంది వెన్నెలా. ఇది చెబితే అర్థమయ్యేదికాదు. అనుభవిస్తేనే అందులో ఆనందం తెలుస్తుంది"

"నిజమే! రోజంతా నాకు పనేం ఉంటుంది? పనివాళ్ళు పనంతా చేసుకొని వెళ్ళిపోతారు. మిమ్మల్ని చూస్తూ కాలం గడిపేస్తున్నా! ఇప్పుడు నాకూ అనిపిస్తోంది. సుమంత్‌ని అడిగి అక్కడికి వెళ్లమంటావా?

"నీకీ ఆలోచన రావటమే ఎంతో బాగుంది.



అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయి భాషా విశిష్ట పురస్కారం అందుకుంటున్న గుంటూరు రెవెన్యూ డివిజినల్ అధికారి, ప్రముఖ కవి శ్రీ సోమేపల్లి వెంకటసుబ్బయ్య. చిత్రంలో రాష్ట్రమంత్రులు శ్రీయుతులు కె. రోశయ్య, ఆనం రామనారాయణరెడ్డి. మండలి బుద్ధప్రసాద్ మరియు అధికార భాషా సంఘం అధ్యక్షులు శ్రీ ఎ.బి.కె. ప్రసాద్ ఉన్నారు.

ఆలోచించకుండా చెప్పేసెయ్..."

"ఎగతాళి చేస్తాడేమోనని భయం"

"సుమంత్ అలా ఏం చెయ్యడు. వాళ్ల సంస్కారం అలాంటిది. పోనీ నేను చెప్పనా?"

"వద్దు... వద్దు... కావాలని తీసుకువచ్చిన దాన్ని నేను కాబట్టి నా అంతట నేనే చెబుతాను. నిన్ను సలహా అడుగుదామని అన్నానంతే!"

"వెన్నెలా! ఒక్క నిమిషం ఉండు. అత్తయ్య "చల్లజంతికలు" చేసారు నోటికి సయిస్తుందని. తెస్తాను... తిందాం" అని క్రిందకు వెళ్లింది.

హేమంతకి మూడోనెల. పుల్లపుల్లటివి తినాలనిపిస్తుందని ఒకటి అవగానే మరొకటి చేసి డబ్బా నింపేస్తున్నారు. అత్తగారు వండి పెట్టడం, కోడలు తినిపెట్టడమూ బాగానే ఉంది అనుకొంది వెన్నెల. అందరు అత్తగార్లూ ఇలాగే ఉంటారా? మరి తన అత్తగారు...? తను అసలు ఆవిడ దగ్గిర ఉంటేగా! చూడటానికి బాగుంటారు ఆవిడ కూడా. ప్రేమగా మాట్లాడతారు. ఎక్కడ తమతో ఉండమంటారో అనే భయంతో తనే వాళ్లకి దగ్గర కాలేకపోయింది. తప్పు చేసానేమో అనే అంతర్మధనం ప్రారంభమైంది ఆమెలో.

వాళ్ళంతా చనువుగా. తమలో కలుపుకోవాలని ప్రయత్నిస్తూంటే తను దూరం దూరంగా జరిగేది. శోభనం కూడా హోటల్‌లోనే! అదీ తన కోరిక మీదే!

హేమంత తన శోభనం గురించి చెబుతూంటే తనకెంతో వింతగా అనిపించింది. మధ్యలో ఒక్కొక్కరూ వచ్చి తలుపులు కొట్టడం, మంచంక్రింద నుంచి పిల్లలు రావడం, కిటికీలు తెరవడం... మళ్లీ వాళ్లను బయటకు పంపి తలుపులు వేసుకోవటం... ఎంత థ్రిల్‌గా అనిపించిందో! సిగ్గు సిగ్గుగా తనకి దగ్గరవ్వాలని ఆరాటపడటం, ఇంతలో ఇలా జరగడం, మళ్ళీ విడిపోవటం, మళ్ళీ దగ్గరవ్వటం. అసలు విసుగు అనిపించలేదు. చివరలో అన్ని తలుపులూ, కిటికీలూ మూసేసామని, గదిలో ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక అతను కౌగలించుకున్న కౌగలింత జీవితంలో మరిచిపోలేను... అంత మధురంగా ఉందనుకో అని హేమంత చెబుతూంటే తనకి ఏదోగా అనిపించింది. ఆ రోజు తమని ఇబ్బంది పెట్టేవారే లేరు. మళ్ళీ అలా తన అత్తగారింట్లో శోభనం చేసుకుంటే... "ఛీ! పిల్లా! శోభనం ఒకసారే! మళ్లీ మళ్లీ చేసుకోరు. ఎవరైనా వింటే నవ్విపోతారు" అంతరాత్మ అదిలించడంతో తన ఆలోచనకి తనే సిగ్గుపడింది.

"ఏమిటోయ్! నీలో నువ్వే సిగ్గుపడి పోతున్నావ్!

"ఏదో చిలిపి ఊహ" అని ఊరుకుంది విడమరిచి చెప్పలేక.

"మా సుమంత్ గుర్తువచ్చాడా ఏం?"

"పో అక్కా! నువ్వు మరీనూ"

"అవును వెన్నెలా! అతను ఉంటే నీ బుగ్గల్లో విరిసిన కెంపులను మూటకట్టుకొని ఒక నక్లెస్ చేయించేవాడు"

"అక్కా!" ఏడిపించవద్దన్నట్లుగా బుంగ మూతి పెట్టింది.

"సర్లే...! ఈ జంతికలు తిను."

తనూ తీసుకొని తినటం ప్రారంభించింది హేమంత.

రెండు తిన్నాక "చాలా బాగున్నాయి హేమ

క్కా" అంది వెన్నెల.

"మా అత్తగారు వంట బాగా చేస్తారు. అనుభవం ఎక్కువ కదా! మీరు కూర్చోండి. మేము చేస్తాం అంటే వినరు. బయట పనులు మీరు చక్కబెట్టండి అంటారు. స్వయంగా వండి, అందరికీ పెడితేనే సంతృప్తిగా ఉంటుందంటారు. ఓపిక తగ్గితే ఎలాగూ మీతో చేయించుకోక తప్పదుగా. ఇప్పటి నుంచే ఎందుకు? అని వంటింటి సామ్రాజ్యాన్ని ఆవిడే ఏలేస్తారు. కూరలు తరిగి పెట్టడం, మిక్సీ వెయ్యడం ఇలాంటి పైపై పనులు మేము చేస్తుంటాం. నేను గర్భవతినని తెలిసిన దగ్గరనుంచీ అసలు నన్నేపనీ చెయ్యనివ్వటం లేదు. వాళ్లు ముగ్గురే చేసుకుంటున్నారు. డాబా కూడా ఎక్క కూడదని ఆంక్షపెట్టారు. పౌర్ణమి చంద్రుణ్ణి చూడడానికి వచ్చానంతే. వాళ్లు గుడి నుంచి వచ్చేటప్పటికి దిగిపోవాలి. ఇలా క్రిందకు దిగి మళ్లీ పైకి ఎక్కానంటే పెద్ద గొడవ అయిపోతుందనుకో...

ఈ నెల్లాళ్ల పరిచయంలో ఇలాంటివి ఎన్నో వింటోంది. అవే క్రమంగా ఆమె మనసును, మనసులోని భావాలనూ మారుస్తున్నాయి.

"హేమక్కా! నాకో సందేహం... పైకి కొట్టుకోనట్లు ఉంటారా? నిజంగా మీలో దెబ్బలాటలు రావా? ఇలా అడగకూడదేమో. అయినా అడగకుండా ఉండలేకపోతున్నాను. ఏమూలో నాకు ఈ చిన్న శంక ఉండిపోయింది. అది కూడా పోగొట్టుకోవాలని"

"పిచ్చివెన్నెలా! గొడవలు ఉంటే లేనట్లు ప్రవర్తించటం ఎవరి వల్లాకాదు. ఏదో మనింటికి చుట్టంచూపుగా ఎవరైనా వచ్చారనుకో... వారి ముందు కాసేపు మన స్వభావాలను తొక్కిపెట్టి ఆపగలుగుతాం వాళ్లు వెళ్లేవరకూ. అంతేగానీ ఇంట్లో ప్రతి నిమిషం అలా ఉండలేంగా! నీకలా అనిపించటంలో తప్పులేదు. అందరూ ఆడవాళ్ళని ఆడిపోసుకుంటారుగానీ వాళ్లు స్వతహాగా మంచివాళ్లే. కానీ ఆ ప్రక్కన, ఈ ప్రక్కన చేరి తమకు లేని ఆనందం ఎదటివారిలో ఉంటే చూసి ఓర్వలేక కొందరు చాడీలు చెప్పేవాళ్లు ఉంటారు. అవి వినేవాళ్లు కొందరు. 'తినగ తినగ వేము తియ్యగా ఉండు' అన్నట్లు వారి మాటల ప్రభావంతో మార్పు సంభవిస్తుంది. అసలలాంటి వాళ్లను మన చెంతకు చేరనివ్వకపోతే, అసలు వచ్చినా అలాంటి మాటలు రాగానే తుంచేస్తే- ఒకటికి రెండు సార్లు మళ్లీ మళ్లీ చెప్పాలని ప్రయత్నిస్తారు. కుదరదని తెలిసాక ఆ విషయాలు మాట్లాడడం మానేస్తారు. మీకు ఇష్టం లేకపోతే ఇంటికి రావటం మానేస్తారు. అలాంటి వాళ్లు మన ఇళ్లకు రాకపోవటమే మంచిది. మా ఇంట్లో ఈ సూత్రాలు పాటిస్తాం కాబట్టే మా మనసులు ప్రక్కవాళ్ళ మాటలలో కలుషితమవకుండా ఉన్నాయి. అందరూ అలా ఉండగలిగితే ఎంత బాగుంటుంది అని అనిపిస్తుంది నాకు".

"నువ్వు చెప్పేది నిజం. ఒక్కసారన్నా మీ ఇంట్లో ఒకరి మీద ఒకరు పోట్లాడుకుంటారేమోనని చూస్తుంటా. అలా అని మీరు పోట్లాడుకోవాలని కాదు... అసలిలా ఎలా ఉండగలుగుతున్నారా అని?"

"ప్రేమలు ఉన్నచోట ఈర్ష్య, అసూయ, ద్వేషాలు ఉండవు. ఒక్కసారి మీ అత్తగారింట్లో అడుగుపెట్టావంటే ఇలాంటివి ఎన్నో నువ్వే నాకు చెబుతావు"

"ఆ రోజు తొందరలో రావాలనే నా కోరిక".

"తప్పక వస్తుంది. నువ్వు అడగటం ఆలస్యం. సుమంత్ నిన్నా ఇంట్లో దింపుతాడు.

సరే! ఇక క్రిందకు వెళదామా? వాళ్లొచ్చేటప్పటికి నేను క్రింద ఉంటే సంతోషపడతారు. ఇక్కడ ఉన్నానంటే కంగారుపడతారు. ఈ వయసులో వాళ్లకి టెన్షన్ తెప్పించటం ఎందుకని... లేకపోతే వాళ్ళు వచ్చేంతవరకూ కూర్చోవచ్చు".

"వద్దక్కా! వెళ్ళిపోదాం! నేనూ వెళ్ళి వంట చేసుకోవాలి. నాకు ఎవరూ చేసిపెట్టేవాళ్లు లేరుగా!" ప్రతిమాటలో దిగులు ప్రత్యక్షమౌతోంది.

ఇద్దరూ క్రిందకు దిగి వచ్చారు. వెన్నెల వెళ్లిపోయింది వాళ్లింట్లోకి.

మరునాడు సాయంత్రం దివ్య అరుగు మీద కూర్చున్న పదిమంది పిల్లలకు పాఠాలు చెబుతోంది. అది ఆమెకు మామూలే.

లాన్‌లో కుర్చీ వేసుకొని కూర్చున్న వెన్నెల అనుకుంది మనసులో. ఈ ఇంట్లో చేరిన రోజున ఆవిడ ట్యూషన్స్ చెబుతారేమో అనుకొంది. తరువాత తెలిసింది... వాళ్లంతా వాళ్లింట్లో పిల్లలే అని. వర్క్ అయిపోగానే ఆ ఇంట్లో సందడి ప్రారంభమౌతుంది. కేరింతలు... అరుపులు... సందడి.

అవి తనకు చిరాకుగా అనిపించటంలేదు. దాంట్లో తనూ పాలు పంచుకోలేకపోతోందే అని అనిపిస్తుంది తప్ప. వాళ్లు ఉన్నంతసేపూ చిన్నపిల్లలా వాళ్లతో కలిసిపోతుంది. అయినా వాళ్లు ఎక్కువసేపు ఉండరు. పిల్లలకు పిల్లలతో ఆడుకోవడమే ఇష్టం మరి.

సుమంత్ వాళ్ల ఫ్యామిలీలో పిల్లలు ఇక్కడితో పోలిస్తే ఎక్కువే. వాళ్లు గుర్తురాగానే వాళ్ల అందమైన ముఖాలు స్ఫురణకి వచ్చాయి! పెళ్లి రోజు వాళ్లు తన దగ్గరకు రావాలని, తనతో మాట్లాడాలనీ దగ్గర దగ్గరలో తచ్చాడేవారు. తను వాళ్లని చూసి పలకరింపుగా కూడా నవ్వేది కాదు. తన ముఖభావం చూసి వాళ్లసలు దగ్గరకు రావటం మానేసి దూరంగా నుంచుని చూడటం ప్రారంభించారు. అది చూసి తను "హమ్మయ్య!" అనుకుంది.

ఇప్పుడు అవన్నీ తలచుకుంటుంటే తను ఎంత ఫూలిష్‌గా ప్రవర్తించిందో అర్థమవుతోంది. చిన్నారి పిల్లలు... వారి మాటలు... స్వచ్ఛమైన పువ్వుల్లాంటి మనసులు... దొరకమన్నా దొరుకుతాయా?

మనసు సూటిప్రశ్న వేదనకు గురిచేసింది. ఇది తను కోరి తెచ్చుకున్నది కదా! ఒక్క మాట సుమంత్‌తో అంటే సరిపోతుంది. ఏదో సంశయం, గిల్టీఫీలింగ్. తనంతట తను అర్థంచేసుకొని తీసుకువెళితే బాగుంటుందనిపిస్తుంది. హేమంత చెబుతానన్నప్పుడు ఊరుకున్నా బాగుండేది. అదీ వద్దంది. ఏమిటో... ఎన్నాళ్ళో... ఈ ఒంటరి రాణీవాసం.

చేతిలో పుస్తకం ఉంది. కళ్లు అక్షరాలను చదువుకుంటూ వెళ్తున్నాయి. కానీ ఒక్క విషయం కూడా బుర్రలోకి ఎక్కటంలేదు. మనసు పెట్టి చదివితేగదా! అది పక్కింట్లోకి పరుగెడుతోంది ప్రతిక్షణం. ఇలాంటి ఆలోచనలు తనకి వస్తాయని ఇప్పటిదాకా తనకే తెలియదు. ఒంటరిగా ఉండటం వల్లనేమో! వీళ్ల కంపెనీ కూడా లేకపోతే తను ఏమయిపోయేదో? ఒంటరికాపురం అంటే ఎన్నో ఊసులు - ఊహలు... క్షణం తీరుబడి ఉండదని, ఒకరి వెంట ఒకరు తిరుగుతూ భార్యాభర్తలు సరసాలు.... ఇలా ఎన్నో ఊహించుకుంది. ప్రొద్దున ఏడు గంటలకు బయటకు వెళ్లిన సుమంత్ రాత్రి పదింటికి చేరతాడు. వచ్చాకా తినడం, నిద్ర

పోవడంలానే ఉంటుంది పరిస్థితి. దానికీ తను తప్పుపట్టలేదు. రోజంతా అలిసిపోతాడు కదా పనిలో అని తనకు తనే సర్దిచెప్పుకుంటుంది. ఇలా ఎన్ని విషయాలలో తనను తాను సర్ది పుచ్చుకోవాలి? రోజంతా ఎవరూ లేకుండా, ఎవరితో మాట్లాడకుండా ఎలా ఉండడం?

లోలోపల దిగులు పెరిగిపోతోంది. ఫోన్‌లో ఎంతసేపు మాట్లాడుతుంది? పోనీ బయటకు వెళదామన్నా ఈ ఊరిలో తనకు స్నేహితులూ లేరు. ఒక్క హేమంతతోనే కాస్త మనసు విప్పి మాట్లాడటం. వాళ్లింట్లో ఎక్కువసేపు ఉండా లనిపిస్తుంది కానీ వాళ్ళేమనుకుంటారో అని సంశయం. ఏమిటీ పిల్ల ఇక్కడే మకాం పెట్టిం దని తన గురించి మనసులో విసుక్కుంటారేమో ననే సంశయం!

పోనీ సుమంత్‌తో కాసేపు మాట్లాడదా మన్నా "బిజీగా ఉన్నాను వెన్నెలా! ఇంటికొచ్చాక మాట్లాడుకుందాం. ఏదైనా అర్జెంట్‌గా చెప్పా ల్సిన విషయం ఉంటే చెప్పి పెట్టేసెయ్" అంటా డు. అంతే... దానితో తను అనుకున్న మాట లన్నీ గొంతులోనే ఆగిపోతాయి. ఇక ఎంత సేపూ ఎదురుచూపుల తతంగమే. అది అలా సుమంత్ వచ్చేవరకూ సాగాల్సిందే!

అరుణ సంధ్య ఆకాశానికి వింత అందా లను చేకూరుస్తోంది. ఒంటరితనం పెరగటం తో ప్రకృతితో సావాసం పెరిగింది. అలా ఆకా శాన్ని పరికిస్తున్న వెన్నెల ఉన్నట్టుండి గమనిం చింది... పక్కింట్లో ఏ అలికిడీ లేకపోవడాన్ని.

"ఏమయ్యారబ్బా! అంతమందీ ఒక్కసారి ఎలా మాయమయ్యారు? హేమంత ఏం చెప్పలేదే? తాళం వ్రేలాడుతూ కనిపించింది. ఊరు వెళ్లారా? వెళితే అందరూ వెళ్లరుగా! రాత్రి పదిగంటలదాకా వాళ్ల ఆలోచనలతోనే గడిపింది. సుమంత్ రావడం, వాళ్లింట్లో సంద డీ ఒక్కసారే మొదలైంది.

ఉండబట్టలేక అడిగేసింది హేమంతని గోడ దగ్గరకు పిలిచి.

"బొమ్మరిల్లు" సినిమాకి వెళ్లాం అందరం. నెల నుంచీ ప్లాన్ చేస్తుంటే ఈ రోజుకు కుది రింది. అందుకే చెక్కేసాం ఆలోచించకుండా. నిన్న నీకు చెబుదామనుకొని మరిచిపోయా! సరే వస్తా" అంటూ లోపలికి వెళ్లిపోయింది.

"తననూ పిలవచ్చుగా" అనుకొంది మనసా గక.

"నువ్వేమయినా వాళ్ల కుటుంబసభ్యురా లివా పిలవటానికి? నువ్వడిగితే పిలిచేవారేమో" అంతరంగం అంది ఎగతాళిగా వ్యంగ్యాన్ని వత్తి పలుకుతూ. ఎంత ఇష్టమైతే మాత్రం అంతలా తనూ వస్తానని అడగటమా? ఏం బాగుం టుంది? తను ఎప్పుడూ అలా చెయ్యదు" అను కొని చిన్నబుచ్చుకున్న ముఖంతో లోపలికి వచ్చింది వెన్నెల. ఇదంతా ఓరకంట గమని స్తూనే ఉన్నాడు సుమంత్. కానీ గమనించనట్లే ఉండిపోయాడు. కాయ పండయ్యేదాకా తను నిరీక్షించక తప్పదు అనుకున్నాడు మనసులో. అలా ఇంకో నెల గడిచిపోయింది.

వెన్నెలకేమీ తినాలనిపించటం లేదు. అదో లా ఉంటోంది. పోనీ కొన్నాళ్ళు పుట్టింటికి వెళదామా అనుకుంది. సుమంత్‌ని వదిలి వెళ్లాలనిపించటం లేదు. అందుకే ఆ ఆలోచనకి స్వస్తి చెప్పింది. డల్‌గా ఉంటున్నావని సాయం త్రం లేడీడాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళాడు. డాక్టరు శుభవార్త చెప్పింది 'తల్లివి కాబోతున్నా వని'. హేమంత విషయం ఇంట్లో తెలిసి నప్పుడు వాళ్ళంతా ఎంత సందడి చేసారో గుర్తు వచ్చింధి. మనసంతా అదోలా అయిపోయింది.

ఇక తన మనసులో మాట బయటపెట్టే క్షణం వచ్చిందని నిశ్చయించుకొంది.

ఆ రాత్రి సుమంత్ "వెన్నెలా! రేపు అమ్మా, నాన్న పుట్టినరోజు. ఇద్దరిదీ ఒకేరోజు కావడంతో మా ఇంట్లో అదే పెద్ద పండుగ. నీ కిష్టమైతే రేపంతా అక్కడే ఉండొచ్చు. లేదంటే కాసేపు ఉండి రావచ్చు"

"అరె... ముందు చెప్పలేదేం? ఇద్దరికీ బట్టలు కొనేవాళ్ళంకదా! రేపు తప్పక వెళ్దాం. రోజంతా అక్కడే ఉందాం" ఉత్సాహంగా అంది.

సుమంత్ మనసులోనే ఎగిరిగంతేసినంత పనిచేసాడు. రోజూ సగం అన్నం అక్కడ తిని, సగం అన్నం ఇక్కడ తిని అవస్థపడిపోతున్నాడు. రెండిటిలో ఆనందాన్ని మిస్ అవుతున్నాడు. అమ్మ అక్కడికెళ్లి తినరా అన్నా కూడా వినడం లేదు. 'అందరం కలిసి తినే రోజు వస్తుందమ్మా' అని నెట్టుకొస్తున్నాడు. వాళ్లను వదిలి అరవై రోజులే అయినా ఆరువందల రోజులయినట్లుంది. రేపు ఈ వెలితి అంతా పూరించుకోవాలి.

ఉదయాన్నే లేచి గబగబా తయారయింది వెన్నెల. ఆమె మనసంతా ఎంతో ప్రశాంతంగా ఉంది. లోపలనుంచి రెండు కవర్లు తీసుకొచ్చి అందించాడు సుమంత్ వెన్నెలకు.

"ఏమిటివి?"

"అమ్మా, నాన్నలకు బట్టలు పెడదామన్నావుగా. నువ్వే కొన్నానని చెప్పు. అమ్మ, నాన్న సంతోషపడ్తారు. ప్రొద్దున షాపులు తెరవరని నిన్ననే కొన్నాను. నువ్విలా అంటావని తెలిస్తే నిన్ను కూడా తీసుకెళ్లేవాడిని. సారీ..."

"ఫరవాలేదు. మనిద్దరిలో ఎవరు కొంటే ఏముంది? నెక్స్‌ట్ ఇయర్ ఇద్దరం కలిసే కొందాం" అంది మనస్ఫూర్తిగా.

కొత్తకోడలు... దానికి తోడు కొత్త కబురుతో వచ్చిందని అందరూ అపురూపంగా చూసారు అత్తవారింట్లో.

వంటమనిషిని పెట్టారు. ఆవిడ వండడం... అందరూ కలిసి తినడం, ఆడటం, పాడటం... సందడే సందడి. అంత్యాక్షరి, లక్కీడిప్, హౌసీ, కేరమ్స్... ఒకటేమిటి? అన్ని ఆటలూ ఆడారు. గ్రూప్ ఫొటోలు దిగారు. రాత్రి భోజనాలప్పుడు పిల్లలు "పిన్నీ! నువ్వు మాతో ఉంటే రోజూ ఇలా ఆడుకోవచ్చుగా" అన్నారు కోరస్‌గా.

"తప్పకుండా ఉంటాను... వెళ్లనే వెళ్లను" అనేసింది అనాలోచితంగానే.

"కాగల కార్యాన్ని గంధర్వులే తీర్చారు" అన్నట్లు పిల్లలే దేవతలయ్యారు.

"వెన్నెలా! ఈ ఇంట్లో మీ గది మీ కోసం ఎప్పటినుంచో ఎదురుచూస్తోంది. దాన్ని భర్తీ చేసెయ్యండి" అంది అత్తగారు నవ్వుతూ.

"ఒరేయ్ సుమంత్! నీ భార్య... సారీ... మా కోడలు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసిందిగా. సామానంతా రేపు షిఫ్ట్ చేసెయ్. అందరం కలిసే ఉందాం" అన్నారు మామగారు... ఆలస్యమైతే కోడలు మనసు మారిపోతుందేమోనన్నట్లు.

"ఏమంటావ్?" అన్నట్లు వెన్నెల వైపు చూసాడు.

అంగీకారమే... అన్నట్లుగా తల ఊపింది సిగ్గుపడుతూ.

తోడికోడళ్లు చేతులు కలిపారు. పిల్లలు ఆనందంతో చప్పట్లు చరిచారు. ఇక అక్కడంతా నవ్వుల పువ్వులే! ●